నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 13 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు



# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

**బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ పోస్టర్‌ను శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీలోని తన స్వగృహంలో బాల్క సుమన్, ముఖ్యనాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మన తెలంగాణ బాపు, కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. చెన్నూరు నియోజకవర్గం నుంచి 60 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేశ్, పల్లె భూమేశ్, వాలా శ్రీనివాసరావు, రిక్కుల మధుకర్‌రెడ్డి, బడికెల సంపత్, కంభగోని సుదర్శన్‌గౌడ్, సూరిబాబు, కలగూర రాజ్‌కుమార్, వేల్పుల రవి, రాంలాల్ గిల్డా, రాజ్‌కుమార్, రామిడి కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గీతకార్మికుడి మృతి

- రక్షణ కవచం కిట్లు అందించకపోవడంతోనే ప్రమాదాలు
- మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండిగౌడ్

తాండూర్, ఏప్రిల్ 12 : గీత కార్మికులకు రక్షణ కవచం కిట్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందించకపోవడంతోనే ప్రమాదాలు జరిగి గీత కార్మికులు మృతి చెందుతున్నారని మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండిగౌడ్ ఆరోపించారు. శనివారం తాండూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాకేశ్‌గౌడ్ కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా జారి పడి చనిపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులను ఆదుకుంటున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదని, కానీ ఇప్పటి వరకూ కార్మికులందరికీ రక్షణ కవచం కిట్లు అందించలేదని ఆరోపించారు. గీత కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకోరా ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గీత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, చనిపోయిన పేద గీత కార్మికుడు తాళ్లపల్లి రాకేశ్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి శంకర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల భాస్కర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గాజుల రమేశ్‌గౌడ్, యువజన నాయకుడు తాళ్లపల్లి సాయిసృజన్‌గౌడ్ ఉన్నారు.



తాండూర్‌లో మాట్లాడుతున్న మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి మొండిగౌడ్





# పప్పు.. జరిగింది తప్పు!

- మార్గదర్శకాలు కాదని నామినేషన్ పద్ధతిలో కేటాయింపులు
- అధికారులపై మంత్రి సీతక్క సీరియస్
- ఎన్నిసార్లు చెప్పినా మారని తీరు
- మంచిర్యాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇష్టారాజ్యం!

## ఐసీడీఎస్‌లో టెండర్లు పిలవకుండానే కందిపప్పు కాంట్రాక్ట్

మంచిర్యాల, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) 'మీరు తప్పులు చేస్తున్నారు.. మేం విమర్శలు ఎదుర్కొంటున్నాం. మీ సొంత నిర్ణయాలతో మేం ఇబ్బందులు పడుతున్నాం..' ఇదీ రెండు రోజుల కిందట ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏకంగా రాష్ట్ర మంత్రి సీతక్క ఆవేదన ఇది..ఐసీడీఎస్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనడానికి ఇదే పెద్ద నిదర్శనం. కొద్ది రోజుల కిందట కందిపప్పు కొనుగోలు విషయంలో అధికారులు ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా నచ్చిన వారికి కట్టబెట్టారు. అంగన్‌వాడీల్లో అధికారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ కాంట్రాక్టు అయినా నచ్చిన వారికి కట్ట బెడుతున్నారు. ఇదంతా జిల్లాలోనే ఉన్నతాధికారులకు సైతం తెలియకుండా చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పును సరఫరా చేసే కాంట్రాక్టర్ల ఎంపిక ఇష్టారాజ్యంగా సాగుతున్నది. నిబంధనల ప్రకారం టెండర్లను ఆహ్వానించి, తక్కువ ధరకు కోట్ చేసే కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాలి. కందిపప్పు కొనుగోళ్లకు రాష్ట్రస్థాయి అధికారులు గరిష్ఠ ధర కిలో రూ.164గా నిర్ణయించారు. దీన్ని అధికారులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు.

**కలెక్టర్‌కే తెలియకుండా కాంట్రాక్ట్ కట్ట బెట్టారు..**

వాస్తవానికి అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనులు చేసి టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి తక్కువ ధరకు కోట్ చేసే అవకాశాలుంటాయి. ప్రభుత్వానికి ఖర్చు మిగులుతుంది. అయితే, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కొందరు అధికారులు మాట్లాడుకుని ఎలాంటి టెండర్లు లేకుండానే కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. మంచిర్యాల జిల్లాలో కట్టబెట్టిన కంట్రాక్టర్ రూ.163 కోట్ చేశారు. గతంలో ఇక్కడ కోడిగుడ్లు సరఫరా చేసిన వ్యక్తికే ఈ పప్పు సరఫరాకు సంబంధించిన కాంట్రాక్టు కూడా అప్పజెప్పడం గమనార్హం. ఆయన చిన్న కోడిగుడ్లు సరఫరా చేయడంపై వచ్చిన విమర్శలను ఉన్నతాధికారులు పట్టించుకోకుండా ఇప్పుడు తిరిగి ఆయనకే కందిపప్పు కాంట్రాక్టు అప్పజెప్పడం అనుమానాలకు తావిస్తున్నది.

**అక్కడ అలా..ఇక్కడ ఇలా..?**

రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించగా, అక్కడ తక్కువకు కోట్ చేశారు. హైదరాబాద్‌లో కిలోకి రూ.118, సూర్యాపేటలో రూ.122.22, ఖమ్మంలో రూ.124.95, పెద్దపల్లిలో రూ.131 చొప్పున ధర చెల్లించి, కందిపప్పును కొనుగోలు చేస్తున్నారు. మంచిర్యాలలో మాత్రం రూ.163కు కోట్ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.




ఇంకా విచిత్రం ఏమిటంటే ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.95 నుంచి రూ.120 మధ్యే ఉండడం గమనార్హం..ఇలా అధికారులు తమకు నచ్చిన వారికి కట్టబెట్టి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తుండడం గమనార్హం. ఇందులో డబ్బుల స్థానంలో అడ్వాన్స్‌గా చెక్కు ఇచ్చినట్లు తెలుస్తున్నది.

**మంత్రి సీతక్క సీరియస్..**

ఇంత జరిగినా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు ఈ వ్యవహారం తెలియక పోవడం గమనార్హం. కాంట్రాక్టు విషయంలో టెండర్లు పిలవకపోయినా డీపీసీ (డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ) ద్వారా అయినా కందిపప్పు కొనుగోలు చేయాలి. కానీ కలెక్టర్ సైతం ఇది తెలియకపోవడం కొసమెరుపు. ఈ వ్యవహారంలో ఏకంగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో సీరియస్ అయ్యారు. కందిపప్పు కొనుగోలు విషయంలో సొంత నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారు..? కొన్ని జిల్లాల అధికారులు పాత కాంట్రాక్టర్లకి కందిపప్పు సరఫరాను నామినేషన్ పద్ధతిలో ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చింది..? సంజాయిషీ ఇవ్వాల్సిందేనంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో కంగుతినడం అధికారుల వంతయింది. మరి ఇప్పటికైనా అధికారులు నామినేషన్ పద్ధతిలో కేటాయించిన ఈ కందిపప్పు టెండర్ రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలుస్తారో లేక అలాగే కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే..

# మోతుగూడ వాగులో ఇసుక దొంగలు

**జేసీబీలు పెట్టిమరీ తోడేస్తున్న మాఫియా**

- రాత్రీ పగలూ తేడా లేకుండా ట్రాక్టర్లలో తరలింపు
- ఒక్కో ట్రిప్పనకు రూ. 2 వేల దాకా వసూలు
- పట్టించుకోని అధికారులు



మోతుగూడ వాగులో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న జేసీబీ

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రం సమీపంలోని మోతుగూడ వాగులో దొంగలు పడ్డారు. రాత్రీ పగలూ తేడాలేకుండా జేసీబీలతో తోడుతూ నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా యథేచ్ఛగా దందా సాగిస్తుండగా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ట్రిప్పనకు రూ. 2 వేలు..**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ అనుమతులు పొందిన ఇసుక రీచ్‌లు లేవు. గతంలో ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ఉన్న వాగుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలించిన మాఫియా.. ఇప్పుడు ఏకంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని మోతుగూడ వాగు నుంచి.. అదీ కూడా ప్రధాన రహదారికి అనుకొని ఉన్న వాగు నుంచి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా రు. రాజకీయ నాయకుల అండదండలు, ఆర్థిక బలం ఉన్న కొంత మంది ఎలాంటి భయం లేకుండా జోరుగా దందా సాగిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ట్రాక్టర్ ట్రిప్పునకు రూ. 1000 దాకా తీసుకోగా, ప్రస్తుతం రూ. 2000 వసూలు చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు**

కొన్ని నెలల క్రితం ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టిన అధికారులు, పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇసుక తరలించే మార్గాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరీ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. ఆపై పట్టించుకోకపోవడంతో ఇసుక దొంగలు మళ్లీ రెచ్చిపోతున్నారు. జిల్లా కేంద్రంలోని మోతుగూడ వాగు నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు ఇసుక తరలిస్తున్నారు. అధికారులు 'మామూలు'గా తీసుకోవడం వల్లే దందా జోరుగా సాగుతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కేస్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మంచిర్యాలలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, నాయకులు

# ఘనంగా హనుమాన్ జయంతి

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు**

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 12 : హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయ యాత్రను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ నాయకుడు వెరబల్లి రఘునాథ్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు పాల్గొని ప్రారంభించారు. డీజే చప్పుళ్లు, కాషాయ జెండాలతో జై శ్రీరామ్...జై హనుమాన్..నామ స్మరణల మధ్య శోభాయాత్ర కనుల పండువగా సాగింది. మంచిర్యాల మార్కెట్లో ఉన్న శ్రీవిశ్వనాథ స్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని అరటి చెట్లు, పండ్లు, మమిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించడం ఆకట్టుకున్నది.

**ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో..**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 12 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్డీవో దత్తారావు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, నాయకులు, హనుమాన్ స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వేశారు..క్యూరింగ్ మరిచారు!



సారంగపల్లిలో శ్మశానవాటికకు వెళ్లే దారిలో కట్టలు నిర్మించి క్యూరింగ్ చేయని సీసీ రోడ్డు

మందమర్రి, ఏప్రిల్ 12: మందమర్రి మండల పరిధిలోని సారంగపల్లిలో శ్మశాన వాటికకు వెళ్లే దారిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు వేసి క్యూరింగ్ చేయకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. రోడ్డును క్యూరింగ్ చేసేందుకు రోడ్డుపై కట్టలు నిర్మించి నీరు పోయడం లేదని ఫలితంగా నిర్మించిన పది రోజుల్లోనే రోడ్డు పగుళ్లు తేలుతున్నదని గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు సుమారు 200 మీటర్ల పొడవునా ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో కింద సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డు వేసి పది రోజులైనా క్యూరింగ్ చేయకపోవడం, అప్పుడే రోడ్డు పగుళ్లు తేలుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని రోడ్డును పరిశీలించి క్యూరింగ్, నాణ్యత విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ఎంపీడీవో రాజేశ్వర్‌ను సంప్రదించగా ఆయన పంచాయతీరాజ్ శాఖ ఏఈని సంప్రదించాలని సూచించారు. ఏఈని ఫోన్‌లో సంప్రదించగా తాను అందుబాటులో లేనని వచ్చిన తర్వాత వివరాలు చెబుతానని తెలిపారు.

# రక్తదానానికి ముందుకు రావాలి

**ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్**

జైపూర్, ఏప్రిల్ 12: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకురావాలని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ సూచించారు. డా.బీఆర్.అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని జైపూర్‌లోని ఎస్టీపీపీలో శనివారం రక్తదానం శిబిరాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన ర్యాలీ తీశారు. ఎస్టీపీపీ ఉద్యోగులతో పాటు పవర్‌మేక్ కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాతలకు మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంక్షేమసంఘం అధ్యక్షుడు పంతులనాయక్, చీఫ్ ఆఫ్ఓఅండ్ఎం జైన్‌సింగ్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్‌మోహన్, డీజీఎం వాటర్ సిస్టం జనగామ శ్రీనివాస్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఐ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.




ఎస్టీపీపీలో ర్యాలీ తీస్తున్న అధికారులు